## క్లుప్తంగా

### ఘనంగా చర్చి వార్షికోత్సవం



రాయలసీమ డయాసిస్ సెక్రెటరీ సాలొమోన్‌ను సన్మానిస్తున్న సంఘ పెద్దలు

చాపాడు: మండల పరిధిలోని కేతవరం గ్రామంలో శుక్రవారం సీఎస్ఐ చర్చి 50వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థన వేడుకలకు ముఖ్య అతిథిగా సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ సెక్రెటరీ సాలొమోను, సంఘం పాస్టర్ రాజేంద్రబాబు, పాస్టర్లు సంపత్‌బాబు, సుందరేషన్, సత్యరాజు, జోసెఫ్ బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఈ వేడుకలకు హాజరైన అతిథులను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, సంఘ పెద్ద జయరాజు, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్‌నియోజకవర్గ కన్వీనర్ బాబ్జీపాల్గొన్నారు.

### పది ఫలితాల్లో ప్రతిభ

రాజుపాళెం: పదో తరగతి ఫలితాల్లో రాజుపాళెం మండలంలో విద్యార్థులు సత్తా చాటారు. మొత్తం 331 మంది పరీక్షలు రాయగా 262 మంది పాస్ కాగా 79 శాతం వచ్చినట్లు ఎంఈఓ రామస్వామి రెడ్డి తెలిపారు. వెల్లాల గ్రామంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని ఎం.వంసిత 571 వచ్చాయని, 76 మందికి గాను 75 మంది పాసైనట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. అలాగే శివప్రియ హైస్కూల్ విద్యార్థి దినకర్ 575, సర్వజ్ఞ హైస్కూల్ విద్యార్థి దస్తగిరి 567, వెలవలి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సానియా 545, అర్కటవేముల జెడ్పీ హైస్కూల్ విద్యార్థి వెంకట హరికృష్ణ రెడ్డికి 548 వచ్చినట్లు ఎంఈఓ తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన కల్లూరు నాగమునిరెడ్డి పొలంలో ఎట్టకేలకు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. సాక్షిలో శుక్రవారం 'ఆగిన విద్యుత్ సరఫరా.. ఎండిన పంటలు' శీర్షికన కథనం ప్రచురించడం జరిగింది. ఈ వార్తకు స్పందించిన అధికారులు వెంటనే పాత ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రైతు నాగమునిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

### మున్సిపల్ కార్మికుల ధర్నా




ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు సక్రమంగా పనిముట్లు ఇవ్వడం లేదని, కరోనా కార్మికులకు 3 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మార్కెట్‌లో పనిచేస్తున్న ముగ్గురు కార్మికులకు 15 నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, చనిపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబంలో మరొకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికులపై రాజకీయ నాయకులు పెత్తనం చేయొద్దన్నారు. యూనియన్ నాయకులు సాల్మన్, విజయ్‌కుమార్, చంటి, గుర్రమ్మ, రవికుమార్, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు.

### 28 నుంచి వేసవి శిక్షణా తరగతులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి వేసవి నృత్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నాట్యవిశారద మొహిద్దీన్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి, భరత నాట్యం, జానపద నృత్యం, సంగీతంలో శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. వైఎంఆర్ కాలనీలోని నటరాజ కళాక్షేత్రంలో సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు, గీతాశ్రమంలో ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు, లైట్‌పాలెం సెంటర్‌లోని ఎంవీఎస్ ధ్యాన కేంద్రంలో సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని ఆయన వివరించారు.

### మాజీ సర్పంచ్ మృతి

ఖాజీపేట : పత్తూరు మాజీ సర్పంచ్ సారే పిచ్చినాయుడు మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించి శుక్రవారం కన్నుమూశారు. మాజీ సర్పంచ్ మృతి విషయం తెలుసుకున్న ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి పిచ్చినాయుడు మృతదేహానికినివాళి అర్పించారు.

### సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రొద్దుటూరు : రామేశ్వరంలోని మూలస్వామి ఆలయంలో శుక్రవారం బాల సత్సంగం సమ్మర్ క్యాంప్‌ను శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు నిర్వాహకురాలు శివదర్శనానంద సరస్వతీ మాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతీ మాతాజీ మాట్లాడుతూ ఈ క్యాప్ ఈనెల 25వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

# పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యం

- మలేరియా వ్యాధిపై అవగాహన
- ర్యాలీల ద్వారా ప్రజల్లో చైతన్యం



ప్రొద్దుటూరు క్రైం : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



బద్వేలు అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా దోమల వ్యాప్తిని అరికట్టాలని, అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా శ్రీరాములపేట, టీబీరోడ్డులోని అర్బన్ హెల్త్ సెంటర్లలో శుక్రవారం మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం థీమ్ ఇస్తారని తెలిపారు. ఈ సారి దోమల అంతం మనతోనే అనే నినాదంతో ముందుకు వెళ్లి అందరిలో మార్పును తీసుకొని రావాలన్నారు. ఆడ ఎనాఫిలస్ దోమ వల్ల మలేరియా వస్తుందని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలని సూచించారు. వైద్యాధికారులు హిమబిందు, పద్మిని, మోహన్‌కాంత్, హెల్త్‌ఎడ్యుకేటర్లు వెంకటేశ్వర్లు, శోభారాణి, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సీఓలు సుబ్బారెడ్డి, నాగజ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

**మలేరియాపై అవగాహన ర్యాలీ**

ప్రొద్దుటూరు రూరల్ : అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని శంకరాపురం, పెన్నానగర్, గోపవరం గ్రామాల్లో శుక్రవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రొద్దుటూరు సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమల నివారణలో వైద్య సిబ్బందితోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. దోమల నివారణతో మలేరియాకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. అనంతరం గోపవరం గ్రామ పంచాయతీ పొట్టిపాడు రోడ్డులోని బాలుర సంక్షేమ శాఖ హాస్టల్‌లో విద్యార్థులకు మలేరియాపై వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అధికారులు డాక్టర్ హనీఫ్ బాబు, డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, చంద్రకళ, ఫార్మసీ అధికారి శ్రీధర్, జూనియర్ అసిస్టెంట్ మధు, ల్యాబ్ టెక్నిషియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

**దోమల నివారణతోనే మలేరియా నిర్మూలన**

చాపాడు: దోమల నివారణ ద్వారా మలేరియా వ్యాధిని నిర్మూలించవచ్చని మండల వైద్యాధికారి డా. రాజేష్ కుమార్ పేర్కొన్నారు. చాపాడు పీహెచ్‌సీ పరిధిలోని దళితవాడలో వైద్యాధికారులు రాజేష్‌కుమార్, శ్రీవాణి, నక్కలదిన్నె పీహెచ్‌సీ పరిధిలోని కేతవరంలో వైద్యాధికారులు కావ్య మాధురి, ఓబులేసు ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మలేరియా దినోత్సవం పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టడం ద్వారా మలేరియా వ్యాప్తిని నిర్మూలించవచ్చని దీనిపై ప్రజలు కల్పించుకోవాలని, ప్రతి ఒక్కరూ కూడా మలేరియా లేని సమాజ నిర్మించుదామనే సంకల్పంతో ముందుకు వెళ్లాలని, దోమ పుట్టరాదు, కుట్టరాదని, ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే పాటించాలనే నినాదాలతో ఆయా గ్రామాలలోని పురవీధులలో వైద్య సిబ్బంది ర్యాలీలు చేశారు. సీహెచ్ఓ మహేదేవ యాదవ్, ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రాఘవయ్య, సూపర్‌వైజర్‌లు బాబురెడ్డి, ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ పద్మ, ఫార్మసీ అధికారి సుభాషిణి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**మలేరియా అంతమొందించవచ్చు**

మైదుకూరు : ప్రజలందరిలో మార్పు వస్తే మలేరియా అంతమవుతుందని మండలంలోని జీవీ సత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధ అన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జీవీ సత్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపించే ప్రబలమైన వ్యాధి అని తెలిపారు. దీనిని సకాలంలో గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుందని పేర్కొన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బి.నర్సింహారెడ్డి, ఎంపీహెచ్ఈఓ వెంకటరమణ, హెల్త్ సూపర్‌వైజర్ నవనీతమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దువ్వూరు : మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలని దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సురేష్‌బాబు, హేమలత, వికసిత పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా డాక్టర్లు వైద్య సిబ్బంది పీహెచ్‌సీ నుంచి దువ్వూరు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్లు రాంగోపాల్, సువర్ణ, శాంతకుమారి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**దోమల నివారణతో మలేరియా దూరం**

బద్వేలు అర్బన్ : దోమల నివారణతో మలేరియాను దూరం చేయవచ్చని, ఇందుకోసం ప్రతిఒక్కరూ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జె.వినయ్‌కుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ టి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్‌జీఓ హోమ్ నుండి నాలుగురోడ్ల కూడలి వరకు వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌జీఓ హోంలో మలేరియా అంతం మనతోనే అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్‌చంద్ర,హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య,హెల్త్ సూపర్‌వైజర్ శివరామిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు రూరల్ : శంకరాపురంలో..



మైదుకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



దువ్వూరులో..



చాపాడులో..

## మండల అభివృద్ధికి సహకరించండి

పోరుమామిళ్ల: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ తహశీన్ కోరారు. శుక్రవారం స్థానిక సభాభవనంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్యసమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే తాగునీటి సమస్య తలెత్తిందని, అక్కడక్కడా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు తెలిసిందని, ఎంపీటీసీలు, సర్పంచులు తమ పరిధిలో ఎక్కడ ఇబ్బంది ఉందని తెలిసినా మా దృష్టికి తేవాలన్నారు. సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ మల్లకతువలో పూడిక చేరి నీరు నిలువడం లేదని వెంటనే పూడిక తీయాలని కోరారు. పుల్లివీడు నుండి పోరుమామిళ్లకు వేసిన పైప్‌లైన్ డ్యామేజ్ అయిందని, కొత్త లైన్ ఏర్పాటు చేసి, పంచాయతీ కార్యాలయంలోని సంప్‌లోని నీరు విడుదల చేయాలన్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ స్పందిస్తూ పైప్ లైన్ మరమ్మతులకు రూ. 70 లక్షలు నష్టపరిహారం కోరుతూ ఆర్అండ్‌బీ అధికారులకు నోటీసు పంపించామని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్, కోఆప్షన్ సభ్యుడు అల్లా, ఎంపీడీఓ రమణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బాషా

## ఉగ్రవాదుల దాడి దుర్మార్గమైన చర్య



ఖాజీపేట : పహల్గామ్ మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు



పహల్గామ్ మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

దువ్వూరు : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడి దుర్మార్గమైన చర్య అని దువ్వూరు అంజుమన్ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. దువ్వూరులోని శుక్రవారం పలు మసీదుల్లో నమాజ్ అనంతరం అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగ్రదాడికి నిరసనగా ర్యాలీ నిర్వహించి దువ్వూరు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాదులు ఎంతో పాశవికంగా దాడికి పాల్పడి భారతీయులను కాల్చి చంపడం దుర్మార్గమన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, అంజుమన్ కమిటీ సభ్యులు ఎల్.తాహిర్‌హుస్సేన్, పఠాన్ షేక్షావలి, చిరాకి గౌస్ బాషా, ముక్తార్ అహ్మద్, చిరాకి బాషా, టీచర్లు సుభాన్, షాకీర్‌బాషా, అంజాద్ హుస్సేన్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

**ఉగ్రవాదుల దాడి అమానుషం**

ఖాజీపేట : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన మారణ హోమానికి నిరసనగా ఖాజీపేటలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పహల్గామ్ మృతులకు నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ పీవీ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశ ప్రజలకు ఉగ్రవాదులను రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అమాయకులైన పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరపడం అత్యంత దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదం నశించాలని, మత సామరస్యాన్ని కాపాడాలని కోరారు. రాష్ట్ర తెలుగు బాషా సంఘం మాజీ సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య,కేసీకెనాల్ ప్రాజక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్‌శ్రీనివాసులరెడ్డి, దవనం గంగాధర్‌పాల్గొన్నారు.

మైదుకూరు : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం మైదుకూరులో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మసీదుల్లో ప్రార్థనల అనంతరం ర్యాలీగా రాయల కూడలికి చేరుకొని అక్కడ పహల్గామ్‌లో ఉగ్రవాదుల చర్యలను వారు ఖండించారు.

బద్వేలు అర్బన్ : కశ్మీర్‌లోని పహల్గామ్ పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి దుర్మార్గమైన చర్య అని హిందూ ధర్మ రక్షా వేదిక కన్వీనర్ సి.రామకోటిరాజు,విశ్వహిందూపరిషత్ జిల్లా ఉపాధ్యక్షులు కొండపల్లి సుభాష్‌కుమార్ పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిని, పశ్చిమబెంగాల్‌లో హిందువులపై జరిగిన దాడిని ఖండిస్తూ శుక్రవారం బీజేపీ, ఆర్ఎస్ఎస్, హిందూసంఘాల ఆధ్వర్యంలో స్థానిక పోరుమామిళ్లరోడ్డులోని అమరవీరుల స్తూపం నుండి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పట్టణ ప్రధాన రహదారుల వెంబడి ర్యాలీ నిర్వహించారు.

**సీపీఐ ఆధ్వర్యంలో..**

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ శుక్రవారం అమరవీరుల స్తూపం వద్ద సీపీఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బాలు,జిల్లా సమితి సభ్యులు వెంకటరమణ,నాయకులు నాగరాజు పాల్గొన్నారు.

**సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో..**

ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా నాయకులు జకరయ్య,అనిల్, నాయకులు రామరాజు, బాబు, విజయరావు తదితరులు పాల్గొన్నారు.

**అమాయక ప్రజలను చంపడం దారుణం**

ప్రొద్దుటూరు కల్చరల్ : కశ్మీర్‌లోని పహల్గామ్‌లో యాత్రికులను ఉగ్రవాదాలు కాల్చి చంపడం దారుణమని డిఫెన్స్ ఎక్స్ సర్వీస్‌మెన్స్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షుడు నేట్ల బాలవీరారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి ఆత్మ శాంతించాలని కోరుతూ కొవ్వొత్తులు వెలిగించి నివాళి అర్పించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పీరయ్య, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్ సాంబశివారెడ్డి, సెక్రటరీ శంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్‌బాబు, సభ్యులు మోహన్, లక్ష్మి రంగా, దస్తగిరి, సుబ్బారెడ్డి, హుస్సేన్‌వలి, శివారెడ్డి, రామతులశయ్య పాల్గొన్నారు.

**కొవ్వొత్తుల ప్రదర్శన**

పోరుమామిళ్ల: కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు నివాళి అర్పిస్తూ శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేరి, బీబీ, ఓబులమ్మ, రఫాయిల్, సాయిప్రసాద్, రహమత్‌బీ, హంద్రయ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేపు స్పందన సుబ్బరామిరెడ్డి సంతాప సభ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అరవిందాశ్రమంలోని అరబిందో ఇంటిగ్రల్ స్కూల్‌లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు పర్యావరణ వేత్త శెట్టిపల్లె సుబ్బరామిరెడ్డి సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు స్వచ్ఛంద సేవా సంస్థల ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి స్పందన స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. సంస్మరణ సభలో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### పెన్నానగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని పెన్నానగర్, ఈశ్వరరెడ్డినగర్‌లలో శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఖాళీ ప్రదేశాలు, పాడుబడిన ఇళ్లను పరిశీలించారు. సరైన రికార్డులు లేని ఆటోలు, బైక్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి ప్రజలతో మాట్లాడారు. అనుమానితులు ఎవరైనా వీధుల్లో తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పూర్తి వివరాలు, వారి ఆధార్‌కార్డులను పరిశీలించిన తర్వాతనే కొత్త వ్యక్తులకు ఇళ్లను బాడుగకు ఇవ్వాలన్నారు. వారి ప్రవర్తనలో ఏవైనా అనుమానించదగ్గ లక్షణాలు కనిపిస్తే పోలీసులకు తెలపాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు గొడవ పడకుండా పోలీస్‌స్టేషన్‌కు రావాలని సీఐ తెలిపారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వీటిని ఎక్కడైనా నిర్వహిస్తుంటే పోలీసులకు చెప్పాలన్నారు. గంజాయి విక్రయిస్తే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు, ఏఎస్ఐ ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎస్ఆర్ఐటీ విద్యార్థికి ఇన్నోవేషన్ అవార్డు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని సాయిరాజరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం విద్యార్థి కె.బాలస్వామిరెడ్డికి ఇన్నోవేషన్ అవార్డు లభించింది. గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషనల్ వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ డే సందర్భంగా క్రియేషన్ ఆన్ హ్యూమనాయిడ్ రోబోట్ రూపొందించినందుకు బాలస్వామిరెడ్డికి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా బాలస్వామిరెడ్డిని ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి అభినందించారు.

### గ్రీన్ ఫీల్డ్ పనులు అడ్డుకుంటాం

చాపాడు: భూములు కోల్పోయి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకూ నష్ట పరిహారం ఇవ్వలేదని, నష్ట పరిహారం ఇవ్వకపోతే గ్రీన్ ఫీల్డు హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుంటామని భూ బాధిత రైతులు పేర్కొన్నారు. మండలంలోని సిద్దారెడ్డిపల్లె, ద్వారకానగరం, జడ్డీగారి కొట్టాలు గ్రామాలకు చెందిన రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ బాధిత రైతులు శుక్రవారం తహసీల్దారు రమాకుమారిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులకు ముందే భూ బాధితులను గుర్తించి పరిహారం అందించారని ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ తమకు మాత్రం భూ పరిహారం అందలేదన్నారు. కొన్ని నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా మాటలు చెప్పి పట్టించుకోవడం లేదని వాపోయారు.

**రైతులకు న్యాయం చేస్తాం**

తహసీల్దారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతుల రికార్డులను పరిశీలించి సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తామన్నారు. భూ పరిహారం అందని రైతుల వద్ద ఉన్న వివరాలను సేకరించి తనకు వెంటనే అందజేయాలని దీనిపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రీ సర్వే డీటీ నారాయణ స్వామి, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, హాజరత్‌రెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

### బ్రహ్మంగారి సన్నిధిలో ఐఎస్ఎస్ అడిషనల్ డైరెక్టర్

బ్రహ్మంగారిమఠం: శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామిని శుక్రవారం సాయంత్రం ఢిల్లీ ఐఎస్ఎస్ అడిషనల్ డైరెక్టర్ సుభాష్ చంద్రమాలిక్ దర్శించుకున్నారు. ఆయనతో పాటు బెంగళూరు నుంచి ఐఎస్ఎస్ జెడ్ఓ హరీస్వారాన్, కడప అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు ఉన్నారు. బి.మఠం పిట్‌పర్సన్ శంకర్ బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి, డిప్యూటీ తహసీల్దార్ జాన్సీలు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. బ్రహ్మంగారు 332 ఆరాధన మహోత్సవాలు వచ్చే నెల 4నుంచి 9వరకు జరుగుతాయని ఉత్సవాలను తిలకించేందుకు రావాలని అడిషనల్ డైరక్టర్‌ను కోరారు.

### స్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండల కేంద్రంలో స్మశాన వాటికకు స్థలం కేటాయించాలని శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్ మాట్లాడుతూ శవాన్ని తీసుకెళ్లాలంటే వాహనానికి వేలాది రూపాయలు చెల్లించాలన్నారు. పట్టణానికి దగ్గరలో స్మశాన వాటికకు భూమి కేటాయించాలని కోరారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

### పార్వతీదేవికి పూజలు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీ భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి శుక్రవారం అర్చకులు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, 101 నిమ్మకాయలు వేసి అమ్మవారిని అర్చకుడు శోభాయమానంగా అలంకరించారు. సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### వ్యవసాయేతర భూ మార్పు కోసం పరిశీలన

చాపాడు: మండల పరిధిలోని ఖాదరపల్లె గ్రామంలో నాగేశ్వరరావు అనే వ్యక్తికి చెందిన వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు శుక్రవారం తహసీల్దారు రమాకుమారి పరిశీలించారు. ఖాదరపల్లె రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సర్వే నంబరు 187/4, 5, 190/1, 2 లో 2.14 ఎకరాల భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు కోసం నాగేశ్వరరావు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ మేరకు తహసీల్దారు, ఆర్ఐ శివశంకర్‌రెడ్డి, వీఆర్వో ఇస్మాయిల్, సిబ్బందితో కలసి భూమిని పరిశీలించారు. ఈ భూ వివరాలపై తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తహసీల్దారు తెలిపారు.

### కాలువ పూడ్చివేతపై లోకాయుక్తకు ఫిర్యాదు

మైదుకూరు : తెలుగు గంగ ప్రాజెక్టులో ప్రధానమైన చెన్నముక్కపల్లె (సీఎంసీ) కాలువను పూడ్చి వేయడంపై మైదుకూరుకు చెందిన బీపీ ప్రతాప్‌రెడ్డి శుక్రవారం లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గడ్డమాయపల్లె వద్ద మోటుగట్టపైకి వాహనాలు వెళ్లేందుకు అనువుగా రోడ్డు నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ సీఎంసీ కాలువలో మట్టిని వేసి పూడ్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తెలుగుగంగ ప్రాజెక్టు సీఈ, ఈఈ స్థాయి ఉన్నతాధికారులు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు అయి కాలువను పూడ్చివేశారని ఆరోపిస్తూ వారిపై ప్రతాప్‌రెడ్డి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు.

### పోలీస్‌స్పోర్ట్స్‌లో సత్తా

ప్రొద్దుటూరు క్రైం : ఆల్ ఇండియా పోలీస్‌స్పోర్ట్స్‌లో పాల్గొని ప్రతిభతో కాంస్య పతకం సాధించిన కానిస్టేబుల్ ఎస్పీ మహబూబ్‌బాషాను శుక్రవారం ప్రొద్దుటూరు డీఎస్పీ భావన అభినందించారు. పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో ఇటీవల ఫస్ట్ ఆల్ ఇండియా పోలీస్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎస్పీ మహబూబ్‌బాషా ఏపీ నుంచి ఫెన్సింగ్ ఫాయిల్ పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించాడు. పతకం సాధించిన కానిస్టేబుల్‌ను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో కోచ్ సలీం పాల్గొన్నారు.